
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం, 5, మే, 2025



సోమశిలలో 50.874 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో 50.874 టీఎంసీల నీటి నిల్వ ఉంది. దిగువ వివిధ కాలువలకు 1110 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.96,500
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,755
3శాతం జీఎస్టీతో	రూ.9,018
నవర (8గ్రా)	రూ.72,144

గరిష్ఠం/కనిష్ఠం
40.4 /27.2

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు అత్యధికం అయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. ఆదివారం గాలిలో తేమ 80 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

7న జిల్లా స్థాయి అండర్‌-7 చెస్ ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న జిల్లా స్థాయి అండర్‌-7 చెస్ చాంపియన్‌షిప్ ఎంపికలు–2025 జరుగుతాయని ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మంజుల, పి.మస్తాన్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పొగతోటలోని రాయ్ చెస్ అకాడమీలో జరుగుతాయని, పోటీల్లో పాల్గొనదలచిన వారు 96033 45326 మొబైల్ నంబరుకు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఆగని సీహెచ్‌ఓల ఆందోళన



డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీహెచ్‌ఓలు

నెల్లూరు (అర్బన్): జిల్లాలోని విలేజ్ హెల్త్ క్లినిక్స్ (ఆయుష్మాన్ భారత్ కేంద్రాలు)లో పని చేస్తున్న సీహెచ్‌ఓలు ఆదివారం సైతం నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖా కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. గ్రామీణ ప్రాంతంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను మూసేసి వారు చేస్తున్న ఆందోళన 8 రోజుకు చేరింది. సీహెచ్‌ఓ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఆదిల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ న్యాయమైన డిమాండ్లు తీర్చాలని కోరారు. వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ వద్దకు వెళ్లి తమ బాధలు చెప్పుకోవాలని ప్రయత్నిస్తే ఆయన హీనంగా చూసి బెదిరింపు ధోరణితో మాట్లాడడం బాధాకరమన్నారు. తాము ప్రభుత్వాన్ని విమర్శించడం లేదని తమ బాధలు వినేందుకు అవకాశం కల్పించాలని కోరారు. మంత్రి తమ మాటలు వెనక్కి తీసుకోవాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను ఆపేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్, కార్యదర్శి రెబకా, పలువురు సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

ఖనిజాన్ని తరలిస్తున్న లారీ సీజ్

• ఆరుగురిపై కేసు నమోదు

సైదాపురం: స్ఫోక్ క్వార్ట్జ్ ఖనిజాన్ని అక్రమంగా తరలించేందుకు లోడింగ్ చేస్తున్న లారీని ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేశారు. సైదాపురం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న యార్డు నుంచి ఆదివారం తెల్లవారుజామున క్వార్ట్జ్ ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ క్రాంతికుమార్ తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఖనిజాన్ని లోడింగ్ చేస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. వీఆర్వో హజరత్తయ్య ఫిర్యాదు మేరకు పనులు చేయిస్తున్న ఆరుగురిపై క్రిమినల్ కేసులను నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి

నెల్లూరు(అర్బన్): నగరంలోని కలెక్టరేట్ శంకరన్ హాల్లో ఆదివారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ జయంతిని ఘనంగా నిర్వహించారు. భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్‌ఓ ఉదయభాస్కర్‌రావు మాట్లాడుతూ గంగను భువికి తెచ్చిన మహనీయుడు భగీరథ మహర్షిని స్మరించడం, పూజించడం మన కర్తవ్యమని తెలిపారు.

మైనింగ్ మాఫియాపై ఇక యుద్ధమే

వేమిరెడ్డి కబంధ హస్తాల్లో మైనింగ్

- వెంకటగిరి రాజాల మైన్లతో సహా జిల్లాలో చాలా మైన్లు మూతేశారు
- ఎంపీ వేమిరెడ్డిపై కేసులు నమోదు చేసేదాకా వదలను
- ఆయన అక్రమాలపై నావద్ద అన్ని ఆధారాలున్నాయి
- కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తా
- మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు (పొగతోట): జిల్లాలో మైనింగ్ మాఫియా దాష్టీకాలపై ఇక ప్రత్యక్ష యుద్ధమే ప్రారంభమవుతుందని, ఈ మైన్లపై ఆధారపడిన వేలాది మంది ప్రజలతో కలిసి మాఫియాను అష్టదిగ్బంధం చేస్తామని మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ హెచ్చరించారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.వేల కోట్లకు అధిపతినని గర్వంగా చెప్పుకునే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మొత్తం మైనింగ్‌ను తన గుప్పెట్లోకి తీసుకుని వందల మంది మైనింగ్ యజమానులు, వేలాది కూలీలు, రవాణాదారుల కడుపులు కొట్టి సంపాదించడం దేనికని ప్రశ్నించారు. దాదాపు 11 నెలలుగా పేద ప్రజలు ఆకలితో అలమటిస్తున్నా.. మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అన్నం పెట్టిన వెంకటగిరి రాజ కుటుంబీకులు, తమ మైన్ల ద్వారా ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. అటువంటి మైన్లను కూడా మూతవేశారని, వాటిని తెరిపించాలని ప్రాధేయపడినా పట్టించుకోవడం లేదన్నారు. ఎంపీ వేమిరెడ్డి అక్రమాలకు సంబంధించి తన వద్ద ఆధారాలు ఉన్నాయని, ఆయనపై కేసులు నమోదు చేసేదాకా వదలనని చెప్పారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి ఆధారాలతో ఫిర్యాదు చేస్తానన్నారు.

నాపైనా తప్పుడు ప్రచారం

ఎన్నికల్లో ఓడిన నాటి నుంచి అనిల్‌కుమార్ యాదవ్ మైనింగ్‌లో రూ.వేల కోట్లు అక్రమంగా దోచుకున్నాడని విష ప్రచారం చేస్తున్నారన్నారు. నిజానిజాలు రాబోయే రోజుల్లో అన్నీ బయటకు వస్తాయన్నారు. మైనింగ్‌తో నాకేం సంబంధం లేకపోయినా తప్పుడు ప్రచారం ఆపడం లేదన్నారు. ఇప్పటిలా మా ప్రభుత్వంలో మైన్లను ఆపేశామా? మైనింగ్ యజమానులు, కూలీలు రోడ్డున పడిన రోజులున్నాయా? ఒక్కరైనా నా మీద ఫిర్యాదు చేశారా? అని ప్రశ్నించారు. ఓటమి తర్వాత నాకున్న కొన్ని వ్యక్తిగత కారణాలతోపాటు ఏడాదిపాటు అధికార పార్టీకి సమయం ఇవ్వాలన్న ఉద్దేశంతో రాజకీయ కార్యక్రమాలకు కొంత దూరంగా ఉన్న మాట వాస్తవమే అన్నారు. అయినప్పటికీ పార్టీని, కార్యకర్తలను ఏనాడూ విడిచి పెట్టలేదన్నారు. అయితే కొంతమంది నాకు, మా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం చేశారన్నారు. నా చిత్తశుద్ధి నాకు, మా అధినేతకు తెలుసన్నారు.

కోర్టులు ఆదేశించినా.. ఫెమీ లేఖ రాసినా లెక్కే లేదు

కూటమి ప్రభుత్వం వచ్చాక మైనింగ్ పనులు ఆపేయడంతో దాదాపు 10 వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. మైనింగ్ జరుగుతున్న గూడూరు, సైదాపురం ప్రాంతాలకు వెళ్తే అక్కడి పరిస్థితులు తెలుస్తాయన్నారు. మైనింగ్ పనులు జరుగుతుంటే పరోక్షంగా వాటిపై ఆధారపడి వ్యాపారం చేసుకుంటున్న హోటళ్ల యజమానులు, టిప్పర్ యజమానులు, పెట్రోల్ బంకులు.. ఇలా అన్ని వ్యాపారాలు మూతపడ్డాయి. ఈ విషయమై మైన్ల యజమానులు కోర్టును ఆశ్రయిస్తే.. వెంటనే ఓపెన్ చేయాలని ఆదేశించినా ఈ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నాయని మైన్లను ఓపెన్ చేయాలని మైనింగ్ సెక్రటరీకి ఫెమీ (ఫెడరేషన్ ఆఫ్ మైనర్ మినరల్స్ ఇండస్ట్రీ– ఇండియా) లేఖ కూడా రాసిందని, నేరుగా ట్విట్టర్లో ముఖ్యమంత్రిని ట్యాగ్ చేసి ఫెమీ ట్వీట్లు కూడా చేసింది. మంద కృష్ణ నేతృత్వంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు పామూరు వెళ్లి మైనింగ్ సెక్రటరీకి ఫిర్యాదు చేశారన్నారు. కనీసం పేదలనే కనికరం కూడా లేకుండా ఈ కూటమి నేతలు, ఎంపీ వేమిరెడ్డి దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. లక్ష్మి క్వార్ట్జ్ శాండ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీకి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డైరెక్టర్‌గా ఉన్నారంటే మతలబు ఏంటో అర్థం చేసుకోవచ్చన్నారు. తర్వాత ఫిని క్వార్ట్జ్ పేరుతో దీనికొక సిస్టర్ కంపెనీ ఓపెన్ చేసి ఇందులో మన్నెమాల విజయకుమార్‌రెడ్డిని డైరెక్టర్‌గా చేశారన్నారు. ఈయన ఎవరికి ఆప్తుడనేది నెల్లూరు ప్రజలందరికీ తెలుసన్నారు.

కాకాణికి అండగా ఉంటా

కొంత కాలంగా మా పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మీద కూడా కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తోందన్నారు. కాకాణి మీద నమోదైన కేసుల్లో న్యాయస్థానాలను ఆశ్రయించడం జరిగిందన్నారు. ఆయనకు నాతోపాటు పార్టీ కూడా ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. పార్టీ కోసం పోరాడుతున్న వ్యక్తుల మీద కేసులు బనాయించినంత మాత్రాన వైఎస్సార్‌సీపీ వెనకడుగు వేస్తుందని వారు అనుకుని ఉండొచ్చు.. కానీ అది ఎప్పటికీ జరగదని కూటమి నాయకులు గుర్తుంచుకోవాలన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

• ఈదురు గాలులకు నేలరాలిన మామిడి

నెల్లూరు (అర్బన్): మండువేసవిలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లాలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఒక్కసారిగా ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకున్నాయి. వాతావరణం కాస్త చల్లబడింది. 3.45 గంటల ప్రాంతంలో జిల్లా వ్యాప్తంగా భారీ ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. నెల్లూరు నగరంలోని వీఆర్‌సీ, బీవీనగర్, కొత్తూరు, అయ్యప్పగుడి, బుజబుజనెల్లూరు, వేదాయపాళెం, వెంకటేశ్వరపురం ఇలా అన్ని ప్రాంతాల్లో వర్షం పడింది. పలు ప్రాంతాలు చిత్తడి, చిత్తడిగా మారాయి. పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. గాలులకు పలుచోట్ల ఫ్లెక్సీలు ఊడిపోయాయి. విద్యుత్ శాఖాధికారులు ముందస్తుగా సుమారు గంట పాటు పలుచోట్ల సరఫరాను నిలిపేశారు. దీంతో నీట్ రాస్తున్న విద్యార్థులు ఆయా సెంటర్లలో ఉక్కపోతతో ఇబ్బంది పడుతూ పరీక్షలు రాశారు. జిల్లాలో అల్లూరు, కొండాపురం, విడవలూరు, కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం, వెంకటాచలం, మనుబోలు, కోవూరు తదితర ప్రాంతాల్లో గాలులతో కూడిన వర్షం కురిసింది. కొమ్మి, సత్యవోలు, పార్లపల్లి, అగ్రహారం తదితర గ్రామాల్లో గాలి ఉధృతికి కొన్ని చోట్ల ఇళ్లలోని రేకులు ఎగిరిపోయాయి. గాలులకు పలు చోట్ల చేతికందిన మామిడి కాయలు రాలిపోయాయి. దీంతో రైతులకు నష్టం వాటిల్లింది. జరిగిన నష్టాన్ని ఉద్యాన శాఖాధికారులు సోమవారానికి అంచనా వేయనున్నారు.



నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో కురుస్తున్న వర్షం

పొగాకు రైతులను ఆదుకో బాబూ

- ప్రారంభించిన వాటికి మళ్లీ కూటమి శిలాఫలకాలు
- పొగాకు రైతుల గోడు పట్టదా



ఆత్మకూరు: అధిక పెట్టుబడులు, పెరిగిన కౌలు, పడిపోతున్న ధరలతో పొగాకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎప్పుడో ప్రారంభించిన వాటికి మళ్లీ మళ్లీ ప్రారంభోత్సవాల పేరుతో శిలాఫలకాలకు ప్రజాధనం దుర్వినియోగం చేయడం, ప్రచారం కోసం కూలీలతో మాట్లాడడం, ప్రతి నెలా ఇచ్చే పింఛన్లను ఇవ్వడం చూసి జనం నవ్విపోతున్నారని, సిగ్గుపడాలన్నారు. ఇదే ప్రాంతంలో పొగాకు రైతులు గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతుంటే వారిని గాలికి వదిలేసి.. ప్రజాధనం ఖర్చు చేసి ప్రచారం చేసుకున్నారంటూ విక్రమ్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పొగాకుకు ఏ మేరకు గిట్టుబాటు ధర లభించిందో ఆ రైతులను అడిగి తెలుసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిలోపే గిట్టుబాటు ధరల్లేక వరి, పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కొన్ని చోట్ల పొగాకు ఉత్పత్తులను తగులబెట్టడం, కొన్ని చోట్ల ఆత్మహత్యలకు సిద్ధం అవుతున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో తెలుస్తుందన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది సాగు ఖర్చులు 30 నుంచి 40 శాతం పెరిగితే.. ధరలు మాత్రం నాణ్యమైన పొగాకుకు 30 శాతం, సగటు ధరలు 50 శాతం మేర తగ్గాయన్నారు. గతేడాది కేజీ రూ.390లకు విక్రయిస్తే.. ఈ ఏడాది రూ.280, సగటు ధర రూ.210లకు పడిపోయిందన్నారు. ఈ విషయాలు తెలుసుకున్న వెంటనే తాను పొగాకు బోర్డు అధికారులతో మాట్లాడానని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వినతి పత్రం అందజేసినట్లు చెప్పారు.

మా అన్న మంత్రిగా ఉండగానే ప్రారంభిస్తే..

గత ప్రభుత్వ కాలంలో మా సోదరుడు, దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి కోట్లాది రూపాయలు నిధులు కేటాయించి ఎంఎస్‌ఎంఈ పార్కును అభివృద్ధి చేయడంతోపాటు అదనంగా 74 ఎకరాలు సేకరించి సిద్ధం చేసి, నాటి కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారన్నారు. మా ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన వాటికి సీఎం, మంత్రులు సిగ్గులేకుండా ఆర్భాటంగా మళ్లీ ప్రారంభోత్సవం చేయించడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఇంత దూరం వచ్చిన సీఎం చంద్రబాబు దృష్టికి డీసీపల్లి పొగాకు బోర్డు పరిధిలోని రైతుల పరిస్థితిని మంత్రి ఆనం వివరించి సీఎం ద్వారా గిట్టుబాటు ధరలను లభించేలా చేసి ఉంటే బాగుండేదన్నారు. గతంలో మేకపాటి గౌతమ్‌రెడ్డి పొగాకు ధరలు మందగించిన క్రమంలో చొరవ చూపి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించి రైతులకు నష్టం వాటిల్లకుండా తీసుకున్న చర్యలను విక్రమ్‌రెడ్డి గుర్తు చేశారు. రానున్న మూడు నెలల పొగాకు అమ్మకాలు జరిగే ఈ సీజన్‌లో రైతులను ఆదుకునేలా వారికి గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే రైతులతో కలిసి రోడ్డెక్కే పరిస్థితి నెలకొంటుందని ఆయన హెచ్చరించారు.

వేకువన మృత్యుఘోష

వేకువజామున 4.50 సమయం. ఒంగోలు సమీపంలోని జాతీయ రహదారిపై మృత్యు ఘోషమిన్నంటింది. ఆగి ఉన్న లారీ వారి పాలిట మృత్యు శకటమైంది. ఈ దుర్ఘటనలో ఆయా కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉన్న బాబాయ్, అబ్బాయ్‌తోపాటు మరో వ్యక్తి విగతజీవులయ్యారు. తండ్రి మరణంతో తల్లి, తమ్ముడికి పెద్దదిక్కుగా మారిన యువకుడికి ఈ నెలాఖరులో పెళ్లి నిశ్చయించారు. ఇంతలోనే ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు దుర్మరణం చెందడంతో వారి బంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదం నెలకొంది.



ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో రోడ్డుపై బోల్తా పడిన కోడిగుడ్ల లారీ

- నెల్లూరీయులు ముగ్గురు దుర్మరణం
- వీరిలో ఇద్దరు బాబాయ్.. అబ్బాయ్
- ఆ యువకుడికి ఈ నెలాఖరులో పెళ్లి నిశ్చయం

ఒంగోలు టౌన్: జాతీయ రహదారిపై ఒంగోలు సమీపంలోని కొప్పోలు ఫ్లై ఓవర్ వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం.. మూడు కుటుంబాలను రోడ్డున పడేసింది. కొప్పోలు ఫ్లై ఓవర్ బ్రిడ్జి దాటిన తర్వాత కొద్ది దూరంలో టైరు పంక్చర్ కావడంతో ఆగి ఉన్న లారీని తెలంగాణ నుంచి నెల్లూరు జిల్లా గుడిపల్లిపాడుకు కోడిగుడ్ల లోడుతో వెళుతున్న లారీ వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది.

బాబాయ్.. అబ్బాయ్ దుర్మరణం

నెల్లూరు జిల్లా గుడిపల్లిపాడుకు చెందిన రావినూతల బాబు (42), రావినూతల నాగేంద్ర (20) వరసకు బాబాయ్, అబ్బాయ్ అవుతారు. తెలంగాణలోని భువనగిరి నుంచి కోడిగుడ్లు తీసుకొని శనివారం రాత్రి నెల్లూరుకు బయలుదేరారు. మరో రెండు గంటలు గడిస్తే గమ్యం చేరుకుంటారనగా రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు బలిగొంది. ఒంగోలు–నెల్లూరు జాతీయ రహదారి మీద కొప్పోలు ఫ్లై ఓవర్ బ్రిడ్జి దాటగానే కొద్ది దూరం ప్రయాణించారో లేదో ఎదురుగా ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. కళ్లు తెరచి చూసే లోపలే పెద్ద శబ్దం వచ్చింది. కోడిగుడ్లన్నీ ఎగిరి రోడ్డు మీద పడ్డాయి. లారీ ముందు భాగం మొత్తం తుక్కుతుక్కయిపోయింది. లారీ డ్రైవర్ రవణయ్య అలియాస్ షేక్ రహీం (60)తో సహా బాబాయ్, అబ్బాయ్ ఇద్దరూ దుర్మరణం పాలయ్యారు. వీరిలో ఒకరి తల పగిలిపోయి ఛిద్రమైంది.

నిద్రమత్తే ప్రాణాలు తీసిందా?

జాతీయ రహదారి మీద కోడిగుడ్ల లోడుతో వెళ్తున్న లారీ రోడ్డు పక్కన పంక్చర్ అయి ఆగి ఉన్న మరో లారీని ఢీకొట్టడంతో మొదట ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన లారీ వెనక నుంచి ఢీకొట్టడంతో సమీపంలోని కొప్పోలు వరకు పెద్ద శబ్దం వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. రాత్రంతా ప్రయాణం చేయడంతో తెల్లవారుజామున నిద్ర ముంచుకొని రావడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు.

ప్రమాదస్థలిని పరిశీలించిన ఎస్పీ

జాతీయ రహదారిపై ఏకకాలంలో మూడు ప్రమాదాలు చోటు చేసుకున్న సమాచారం అందుకున్న ఎస్పీ ఏఆర్ దామోదర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయివడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పర్యవేక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ అతివేగం, నిర్లక్ష్యం వల్లనే రోడ్డు ప్రమాదం జరిగినట్లు చెప్పారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, రవాణా శాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీఐలు, ఎస్సైలు, నేషనల్ హైవే సిబ్బంది ఉన్నారు.

గుడిపల్లిపాడులో విషాదం

నెల్లూరు సిటీ: ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడు అరుంధతీయపాళానికి చెందిన బాబాయ్, అబ్బాయ్ మృతి చెందారు. ఈ ఇద్దరు వారి కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉన్నారు. కోడిగుడ్ల లారీకి లోడింగ్, అన్‌లోడింగ్‌తోపాటు క్లీనర్స్‌గా వెళ్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదం నెలకొంది. నెల్లూరు నగరానికి చెందిన డ్రైవర్ షేక్ రహీం కూడా ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు.

ఆ ఇంటికి ఆయనే పెద్ద దిక్కు..



రావినూతల బాబు (ఫైల్)

ఈ ప్రమాదంలో రావినూతల బాబు (42) మృతి చెందాడు. ఆ కుటుంబానికి ఆయనే పెద్ద దిక్కు. ఆయనకు భార్య భాగ్యలక్ష్మితో పాటు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కుమారుడు దినేష్, 9వ తరగతి చదువుతున్న కుమార్తె దివ్య ఉన్నారు. కోడిగుడ్ల రవాణా పనులతోపాటు కూలి పనులతో ఆ కుటుంబాన్ని తన రెక్కల కష్టంతో పోషించుకుంటున్నాడు. బాబు మృతి చెందడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. కూలి పనులకు వెళ్తూ కష్టమైనా పిల్లలకు మంచి చదువులు చదివిద్దామనుకున్నారు. ఇంతలోనే తండ్రి మృతి చెందడంతో చదువుతున్న పిల్లలు ఇద్దరూ భవిష్యత్ అంధకారమైందంటూ కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు చూసి స్థానికులు సైతం చలించిపోయారు.

వయస్సులోనే చిన్న.. ఇంటికి పెద్దగా..



రావినూతల నాగేంద్ర (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు రావినూతల నాగేంద్ర (20) వయస్సులో చిన్నోడయినప్పటికీ ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్నాడు. తండ్రి వెంకటసుబ్బయ్య కొంత కాలం క్రితం మృతి చెందడంతో కుటుంబ పోషణ నాగేంద్ర తన భుజాలపై వేసుకున్నాడు. తల్లి కామాక్షమ్మ, 9వ తరగతి చదువుతున్న తమ్ముడు యశ్వంత్ బాగోగులు చేసుకుంటున్నారు. ప్రతి వారం హైదరాబాద్ నుంచి నెల్లూరుకు కోడిగుడ్ల సరఫరా చేస్తుంటారు. మిగతా రోజుల్లో నాగేంద్ర కష్టాన్ని సైతం లెక్క చేయకుండా కూలి పనికి వెళుతుండేవారు. అయితే ఆదివారం ఒంగోలు సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు స్థానికులు చెప్పడంతో వారి రోదనలు మిన్నంటాయి. నాగేంద్రకు ఈ నెలాఖరున వివాహం నిశ్చయించుకుని ఉన్నారు. పెళ్లి ఏర్పాట్లలో కుటుంబం ఎంతో సంతోషంగా ఉన్న సమయంలో రోడ్డు ప్రమాదంలో నాగేంద్ర మృతి చెందారనే విషయం ఆ కుటుంబాన్ని శోక సముద్రంలో ముంచింది. తల్లి, తమ్ముడు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండడంతో చూసిన స్థానికులు సైతం బరువెక్కిన గుండెలతో కంట తడి పెట్టారు.

కావలిలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- 2018 నాటి పైలాన్ ధ్వంసంపై తాజాగా కేసు రీఓపెన్
- 12 మందిని నిందితులుగా చేర్చిన పోలీసులు
- 8వ నిందితుడిగా కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి
- సాక్షి సహా నలుగురు జర్నలిస్టుల అరెస్ట్
- 14 రోజుల రిమాండ్ విధించడంతో కావలి సబ్‌జైల్‌కు తరలింపు

సాక్షిప్రతినిధి, నెల్లూరు: కావలిలో రెడ్‌బుక్ రాజ్యాంగం వెర్రితలలు వేస్తోంది. కూటమి పాలకుల దాష్టీకాలను ఎండగడుతున్నారని సాక్షి సహా మీడియా రిపోర్టర్లను టార్గెట్ చేసి ఎప్పుడో 2018 నాటి పైలాన్ ధ్వంసంపై తాజాగా కేసు రీఓపెన్ చేసి పలువురిపై నమోదు చేశారు. పోలీసులు సైతం వాస్తవాలను విస్మరించి కూటమి నేతలకు దాసోహమయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణలో విఫలమైన యంత్రాంగం కక్ష సాధింపు చర్యల్లో మాత్రం అధికార పార్టీ నేతలకు ఊడిగం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అధికార పార్టీ నేతల మెప్పు కోసం ప్రతిపక్ష పార్టీ నాయకులతోపాటు జర్నలిస్టులపై సైతం అక్రమ కేసులు బనాయించేందుకు వెనుకాడటం లేదన్న విమర్శలున్నాయి.

12 మందిపై కేసు నమోదు.. నలుగురు జర్నలిస్టుల అరెస్ట్

ఏడేళ్ల కిందట జరిగిన ఘటనకు సంబంధించి కేసును రీఓపెన్ చేసి జర్నలిస్టులతోపాటు కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పలువురు నేతలు మొత్తం 12 మందిపై కేసు నమోదు చేశారు. ఆదివారం హడావుడిగా నలుగురు జర్నలిస్టులను అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా ఈ నెల 16వ తేదీ వరకు రిమాండ్ విధించారు. పోలీసులు వారిని రిమాండ్ నిమిత్తం సబ్ జైలుకు తరలించారు.

అసలేం జరిగింది..

టీడీపీ హయాంలో సుమారు రూ.79 కోట్లతో కావలిలో అమృత్ పథకం కింద అభివృద్ధి పనులకు సంబంధించి 2018 జనవరి 8న అప్పటి మంత్రి నారా లోకేశ్ పైలాన్ ఆవిష్కరించారు. దానిని 2020లో గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటనపై టీడీపీ నేతల ఫిర్యాదు మేరకు 2020 ఏప్రిల్ 11వ తేదీన కావలి రెండో పట్టణ పోలీసులు 447, 427 ఐపీసీ, 3 పీడీపీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అయితే సరైన ఆధారాలు లభించకపోవడంతో కేసును మూసివేశారు. ఆ తర్వాత ఇదే స్థలాన్ని మున్సిపల్ అధికారులు జర్నలిస్టుల విజ్ఞప్తి మేరకు ప్రెస్‌క్లబ్‌కు కేటాయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రెస్‌క్లబ్‌ను స్వాధీనం చేసుకుని అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. అయితే ఈ క్రమంలో కూటమి పాలకుల వైఫల్యాలను వైఎస్సార్‌సీపీ నేతలు, పలువురు జర్నలిస్టులు ఎత్తి చూపుతున్నారు. దీనిని జీర్ణించుకోలేని నేతలు నాటి కేసును రీఓపెన్ చేయించారు. కావలి 'సాక్షి' ఆర్‌సీ ఇన్‌చార్జి కుర్రు శ్రీనివాసరావు (కేఎస్), విశాలాంధ్ర మాజీ విలేకరి కేదారు మాలకొండయ్య, సుపథ మీడియా రిపోర్టర్ బి. వెంకటలక్ష్మీనారాయణ, రిపోర్టర్లు వి.ప్రసాద్, శ్రావణ్‌కుమార్, జ్యోతి అనిల్, 10 టీవీ రిపోర్టర్ వెంకటరావు, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మన్నెమాల సుకుమార్‌రెడ్డి, కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డితోపాటు మరికొందరు వైఎస్సార్‌సీపీ నాయకులను నిందితులుగా చేర్చి అదనంగా 307, 120 (బి), 109 ఆర్/డబ్ల్యూ 34 ఐపీసీ సెక్షన్లు యాడ్ చేశారు. ఆదివారం కావలి రెండో పట్టణ పోలీసులు కె. శ్రీనివాసులు (కేఎస్)తోపాటు మాలకొండయ్య, లక్ష్మీనారాయణ, ప్రసాద్‌లను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. తమను ఎందుకు అదుపులోకి తీసుకున్నారని వారు అడిగినప్పటికీ సమాధానం చెప్పలేదు. జర్నలిస్టు కుటుంబ సభ్యులు, సహచరులు స్టేషన్‌కు వచ్చి విషయం తెలుసుకునే ప్రయత్నం చేసినప్పటికీ సరైన సమాధానం చెప్పలేదు. రాత్రి వారిని అరెస్ట్ చూపించి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఈ నెల 16వ తేదీవరకు రిమాండ్ విధించడంతో వారిని కావలి సబ్ జైలుకు తరలించారు. అధికార పార్టీ నేతలు, పోలీసుల తీరుపై జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి. అక్రమ అరెస్ట్‌కు సంబంధించి సోమవారం జిల్లా కేంద్రంలో ఆందోళనకు జర్నలిస్టు సంఘాలు సిద్ధమయ్యాయి.


దీకేదబ్ల్యూ కాలేజీ వద్ద చెవి కమ్మలు తీస్తున్న విద్యార్థిని


విద్యార్థిని తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది

విద్యార్థులకు 'నీట్' కష్టాలు

- పరీక్ష మధ్యలో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- సరైన వెలుతురు, గాలి లేక ఇబ్బందులు
- కొన్ని కేంద్రాల్లో పరీక్ష ముగిసిన తర్వాత వేలిముద్ర

నెల్లూరు (టౌన్): ఎంబీబీఎస్, బీడీఎస్ ఇతర వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆదివారం నిర్వహించిన నీట్ యూజీ - 2025 విద్యార్థులకు చుక్కలు చూపెట్టింది. ఆదివారం నెల్లూరు నగరంలోని 10 సెంటర్లలో పరీక్షను నిర్వహించారు. జిల్లాలోని నలుమూలల నుంచి 2,913 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 2,852 మంది హాజరయ్యారు. 61 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరిగింది. విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతించారు. క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత అనుమతించలేదు. పరీక్ష ప్రారంభమైన గంటన్నర తర్వాత గాలివాన రావడంతో నగరంలోని దాదాపు అన్ని సెంటర్లలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆయా కేంద్రాల్లో గంటకు పైగా సరఫరా నిలిచిపోయింది. జనరేటర్లు, ఇన్వర్టర్లు లేకపోవడంతో విద్యార్థులు సరైన గాలి, వెలుతురు లేక ఇబ్బందులు పడ్డారు. గతంలో ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షను నిర్వహించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయినా జనరేటర్ ద్వారా తక్షణమే పునరుద్ధరించే అవకాశం ఉండింది. ప్రధానంగా ఈసారి చీకటి గదుల్లో పరీక్షల నిర్వహించడంతో విద్యార్థులు సక్రమంగా రాయలేకపోయినట్లు తెలుస్తోంది. దీంతో ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇక సెంటర్‌లోకి వచ్చిన వెంటనే సంబంధిత విద్యార్థితో సదరు వేలిముద్ర వేయించాల్సి ఉంది. అయితే చాలాచోట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహించారు. పరీక్ష ముగిసిన తర్వాత విద్యార్థులతో వేలిముద్ర వేయించారు. ఈ క్రమంలో గంటల తరబడి అసౌకర్యానికి గురయ్యారు. నీట్ నిర్వాహకులు సరైన వసతులు కల్పించకపోవడంతో విద్యార్థుల తోపాటు వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అవస్థలు ఎదుర్కొన్నారు. పరీక్ష రాసేందుకు వెళ్లిన వారు తిరిగి వచ్చేంత వరకు కేంద్రాల వద్దే పడిగాపులు కాశారు.


చెట్టు నీడన విద్యార్థుల కుటుంబ సభ్యులు


ఆల్ ది బెస్ట్ చెబుతూ..

క్లుప్తంగా

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

ఉలవపాడు: గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై చాగల్లు అండర్‌పాస్ వద్ద ఆదివారం జరిగింది. ఒంగోలు నుంచి కావలి వెళ్లే వైపు మృతదేహం లభ్యమైంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అంకమ్మ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 70 ఏళ్లు ఉంటుందని భావిస్తున్నారు. యాచకుడై ఉంటాడని, ఎండ వేడిమికి తట్టుకోలేక చనిపోయి ఉండొచ్చని చెబుతున్నారు. వృద్ధుడి ఒంటిపై చొక్కా లేదు. బులుగు రంగు లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి..

- వ్యక్తి మృత్యువాత

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని శివాలయం ప్రాంతంలో నివాసం ఉండే యస్దానీ (38) అనే వ్యక్తి చెరువులో పడి మృతిచెందిన ఘటన ఆదివారం జరిగింది. బంధువుల కథనం మేరకు.. కూలీ అయిన యస్దానీ బహిర్భూమికి చెరువు వద్దకు వెళ్లాడు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో బంధువులు గాలించగా నీటిలో శవమై కనిపించాడు. అతడికి వివాహమైంది. భార్య గతంలోనే విడిపోయిందని, పిల్లల్లేరని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

సైకిల్‌పై వెళ్తుండగా..

- లారీ ఢీకొని వృద్ధుడి మృతి


ఘటనా స్థలంలో రంగయ్య

కందుకూరు: సైకిల్‌పై వెళ్తున్న వృద్ధుడిని లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందిన ఘటన ఆదివారం కందుకూరు పట్టణంలో జరిగింది. బంధువులు, పోలీసుల కథనం మేరకు.. కందుకూరు మండలం మహదేవపురం గ్రామానికి చెందిన నేరెళ్ల రంగయ్య (65) అనే వృద్ధుడు ఆదివారం ఉదయం వ్యక్తిగత పని నిమిత్తం సైకిల్‌పై పట్టణానికి వచ్చాడు. నిత్యం రద్దీగా ఉండే పోస్టాఫీస్ సెంటర్‌లో సైకిల్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు లారీ ఢీకొట్టింది. రంగయ్య కాలుపై నుంచి లారీ టైర్లు వెళ్లడంతో నుజ్జునుజ్జయింది. తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రంగయ్య మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదాల దారి

నూతన జాతీయ రహదారి 167బీ వరుస ప్రమాదాలతో నెత్తురోడుతోంది. పలువురు ప్రయాణికులు మృత్యువాతపడ్డారు. దీంతో ఈ రోడ్డుపై తిరగాలంటేనే భయపడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్డు డిజైన్‌లో సరైన ప్రమాణాలు పాటించకపోవడంతోపాటు, కొందరు వాహనదారుల నిర్లక్ష్యం యాక్సిడెంట్లకు కారణంగా తెలుస్తోంది.

- నెత్తురోడుతున్న 167బీ జాతీయ రహదారి
- పలువురి మృత్యువాత, మరికొందరికి గాయాలు
- బెంబేలెత్తుతున్న ప్రయాణికులు

బైపాస్‌రోడ్డులో చుట్టుగుంట క్రాస్ వద్ద జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వ్యాపారి రమణయ్య (ఫైల్)




వలేటివారిపాళెం మండలంలో ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మాధవరావు (ఫైల్)

కందుకూరు: మైదుకూరు నుంచి సింగరాయకొండ వద్ద ఉన్న చెన్నై –కోల్‌కత్తా జాతీయ రహదారి 16ను అనుసంధానం చేస్తూ నూతనంగా హైవే 167బీని 189 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి ప్యాకేజీ కింద సింగరాయకొండ నుంచి మాలకొండ వరకు 45.73 కిలోమీటర్ల రహదారి పనులు సుమారు 90 శాతం పూర్తి చేశారు. ప్రస్తుతం ప్రధాన రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. కాగా వరుసగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

భద్రతా ప్రమాణాలెక్కడ?

ఎంతోకాలంగా ఊరిస్తూ వస్తున్న కందుకూరు ప్రాంతవాసుల జాతీయ రహదారి కల తీరింది కానీ నేడది ప్రమాదాలకు నిలయంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. రోడ్డు నిర్మాణంలో సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో యాక్సిడెంట్లు జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. సింగరాయకొండ నుంచి మాలకొండ వరకు కీలకమైన ప్రాంతాల్లో కూడా సరైన భద్రతా ప్రమాణాలు పాటించలేదని ప్రచారం ఉంది.

అండర్‌పాస్‌లు లేక..

రోడ్డును రెండు వరుసలుగా నిర్మించినా ఎక్కువగా మలుపు ఉండటం, అండర్‌పాస్‌లు లేకపోవడం ప్రమాదాలకు కారణంగా మారింది. 45 కిలోమీటర్ల పొడవులో జాతీయ రహదారి నుంచి అనేక గ్రామాలకు వెళ్లే రోడ్లున్నాయి. ప్రధానంగా కందుకూరు బైపాస్‌రోడ్డులో కూడా చుట్టుగుంట, దివివారిపాళెం, కొండముడుసుపాళెం వంటి గ్రామాలకు వెళ్లేందుకు ఈ రోడ్డును దాటాలి. అయితే ఈ ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు లేవు. కందుకూరు నుంచి కావలి వైపు వెళ్లే రోడ్డు కొండముడుసుపాళెం వద్ద క్రాస్ అవుతుంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అటువంటి చోట కూడా అండర్‌పాస్ బ్రిడ్జి లేదు. దీనిపై ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. డిజైన్ మార్చాలని లేదంటూ భవిష్యత్‌లో ఊహించని ప్రమాదాలు జరుగుతాయని చెబుతున్నారు. గ్రామాలకు వెళ్లే రోడ్లు అధికంగా ఉండటంతో రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే కొత్త రహదారి ప్రయాణానికి సౌకర్యవంతంగా ఉండటంతో కొందరు వాహనదారులు మితిమీరిన వేగంతో వెళ్తున్నారు. జాతీయ రహదారి అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు (ఫైల్)

ఇటీవల జరిగిన ఘటనలు

- ➤ కందుకూరు పట్టణానికి బయట నుంచి దక్షిణం వైపు బైపాస్ రోడ్డును నిర్మించారు. ఈ బైపాస్‌రోడ్డుపై చుట్టుగుంట క్రాస్ వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.
- ➤ పోతురాజుమిట్ట ప్రాంతానికి చెందిన గోతాల వ్యాపారి రమణయ్య ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు దాడుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో రమణయ్య అక్కడికక్కడే మరణించాడు. కారులో ప్రయాణిస్తున్న వలేటివారిపాళేనికి చెందిన కాటా అంజయ్య కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. హాస్పిటల్లో చికిత్స పొందుతూ అంజయ్య భార్య పుష్ప మరణించారు. అంజయ్య తీవ్రగాయాలతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు.
- ➤ వలేటివారిపాళెం మండలంలో అంకభూపాలపురం క్రాసింగ్ వద్ద జరిగిన ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ప్రమాదంలో అత్తింటివారిపాళేనికి చెందిన కొల్లూరి మాధవరావు (45) అనే వ్యక్తి అక్కడికక్కడే మరణించారు. ఇదే ప్రాంతంలో ఇటీవల కాలంలో ఐదు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ముగ్గురు చనిపోగా, పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయపడ్డారు.
- ➤ పోకూరు వద్ద బైక్, కారు ఢీకొన్న ప్రమాదంలో శింగమనేనిపల్లి గ్రామానికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బాశం దినేష్ (25) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కందుకూరు నుంచి వలేటివారిపాళెం మధ్య మూడు, నాలుగు నెలల కాలంలో జరిగిన ప్రమాదాల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురికి గాయాలయ్యారు.
- ➤ సింగరాయకొండ వైపు వెళ్లే దారిలో ఓగూరు వద్ద లారీ ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న గంగవరపు వెంకటేశ్వర్లు అనే రైతు మృతిచెందాడు. ఇదే ప్రాంతంలో రవి గార్డెన్స్ వద్ద బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో జరుగుమల్లి మండలం చిరుకూరపాడుకు చెందిన మెడబలిమి నాగరాజు అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం


మ్యాచ్‌లో తలపడుతూ..

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో జాతీయ స్థాయి పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌ను శాప్ చైర్మన్ రవినాయుడు, వర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఐదురోజులపాటు జరిగే ఈ టోర్నమెంట్‌కు దేశంలోని వివిధ యూనివర్సిటీల నుంచి 97 టీమ్‌లు విచ్చేశాయి. తొలిరోజున 30 మ్యాచ్‌లు జరిగాయి.

వివాహిత ఆత్మహత్య

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ గ్రామానికి చెందిన వెంకటరమణమ్మ (27) అనే వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంటి చుట్టుపక్కలవారు గమనించి ఆమెను ఓ ప్రైవేట్ వాహనంలో నెల్లూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వెంకటరమణమ్మ మృతిచెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 132
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 234
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 258
లేయర్ చికెన్	: 170

కత్తిపోట్లకు గురైన మహిళ మృత్యువాత

- హత్య కేసుగా మార్పు


మహిళ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): కత్తిపోట్లకు గురైన మహిళను మెరుగైన వైద్యం నిమిత్తం చెన్నైకు తరలిస్తుండగా దారిలో మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. బుజబుజనెల్లూరు చెన్నకేశవులనగర్‌కు చెందిన సయ్యద్ మాబునీ (33), గౌస్‌బాషా దంపతులకు ఇద్దరు పిల్లలు. అదే ప్రాంతానికి చెందిన బి.విజయ్ లారీ డ్రైవర్. అతను తరచూ మద్యం మత్తులో ఇష్టానుసారంగా ప్రవర్తించేవాడు. పలు కేసులున్నాయి. విజయ్ చేష్టలను పలుమార్లు మాబునీ అడ్డుకుని పద్ధతి మార్చుకోవాలని సూచించింది. అయినా మారలేదు. మూడు నెలల క్రితం విజయ్ తన కుటుంబంతో కలిసి ఇల్లు ఖాళీ చేసి పక్క వీధిలో చేరాడు. శనివారం సాయంత్రం మాబునీ పిల్లలు ఆడుకుంటూ ఈలలు వేస్తుండగా మద్యం మత్తులో ఉన్న విజయ్ వారిని తిట్టాడు. వారు భయపడి పరుగులు తీయగా వారిని వెంబడించి ఇంటి వద్దకెళ్లి గొడవ చేశాడు. దీంతో మాబునీ అతని ఇంటికెళ్లి నిలదీయగా కోపోద్రిక్తుడైన విజయ్ కత్తితో ఆమెపై దాడి చేశాడు. మూడుచోట్ల పొడవడంతో తీవ్రంగా గాయపడింది. ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ఆస్పత్రికి, అక్కడి నుంచి మరో ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆదివారం తెల్లవారుజామున చెన్నైకు తరలిస్తుండగా మాబునీ మృతిచెందింది. మృతురాలి సోదరుడు ఇమామ్‌బాషా వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రోశయ్య హత్యాయత్నం కేసును హత్య కేసుగా మార్చి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.

కండలేరులో 45.094 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 45.094 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 60, పిన్నేరు కాలువకు 150, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

వృద్ధుడి బలవన్మరణం

నెల్లూరు సిటీ: ఆర్థిక, అనారోగ్య సమస్యలు తాళలేక ఓ వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. రూరల్ నియోజకవర్గంలోని కోడూరుపాడు కల్లీ కాలనీలో షేక్ అమీర్‌జాన్ (60) అద్దెకు ఉంటున్నాడు. పదేళ్ల క్రితం భార్య నుంచి విడిపోయాడు. కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఆర్థిక సమస్యలతో తిండికి కూడా కష్టమైపోయింది. దీంతో చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. మూడు రోజుల క్రితం తన ఇంట్లో ఉరేసుకున్నాడు. ఆదివారం దుర్వాసన రావడంతో స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫలరాజు రెడీ



- మార్కెట్‌లోకి ఉలవపాడు మామిడి
- హైవేపై దుకాణాల ఏర్పాటు
- అమ్మకాలు ప్రారంభం

ఉలవపాడు: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఉలవపాడు మామిడి మార్కెట్‌లోకి వచ్చింది. నోరూరించే మధురమైన ఫలం ఈ ఏడాది ఆలస్యమైంది. ఈనెల మొదటి వారం నుంచి అమ్మకాలు ప్రారంభమయ్యాయి. తొలిపూత కాయలు ఇప్పుడిప్పుడే పంటకు వస్తున్నాయి. డిమాండ్ కారణంగా రైతులు పచ్చికాయలను కోసి అమ్మకాలు ప్రారంభించారు. ఉలవపాడు బంగినపల్లికి ఉన్న క్రేజ్, డిమాండ్ కారణంగా వాటికి కోసం చాలామంది ఆశగా ఎదురుచూస్తారు. ప్రతి ఏడాది ఏప్రిల్‌లో వచ్చే మామిడి ఈసారి కొంత ఆలస్యమైంది. పూర్తి స్థాయిలో బాగా ముదురు కాయలు కావాలంటే ఇంకా వారం రోజులు పడుతుందని రైతులు అంటున్నారు. ఉలవపాడు ప్రాంతంలో బంగినపల్లి, పెద్ద రసాలు, చిన్నరసాలు, కొబ్బరి మామిడి, తోతాపురి, సువర్ణరేఖ, హిమామ్ పసంద్, నీలం రకాలు అందుబాటులో ఉన్నాయి.

200 దుకాణాలు

నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే 16వ నంబర్ జాతీయ రహదారి ఈ రెండు నెలలు మ్యాంగో ఎక్స్‌ప్రెస్ హైవేగా మారుతుంది. వాహనదారులను ఆకట్టుకునేలా అందంగా దుకాణాలను తీర్చిదిద్ది కాయలను పేర్చి అమ్మకాలు సాగిస్తారు. మండల పరిధిలోని వీరేపల్లి నుంచి ఉలవపాడు వరకు సుమారు 8 కి.మీ మేర 200 దుకాణాలు జాతీయ రహదారి వెంబడి ఏర్పాటు చేశారు. గతంలో కన్నా ఈ ఏడాది అధికంగా పెడుతున్నారు. ఎగుమతుల తోపాటు ఈ వ్యాపారం కూడా అధికంగా సాగుతుంది.


ఉలవపాడు బంగినపల్లి రకం మామిడి

అమ్మకాలిలా..

జాతీయ రహదారితోపాటు తోటల్లో కూడా కాయల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం కొబ్బరి రకం కాయ రూ.70కి అమ్ముతున్నారు. బంగినపల్లి కేజీ రూ.100, పెద్దరసాలు కేజీ రూ.120గా ఉంది. ఈ ఏడాది దిగుబడి తక్కువగా వచ్చే అవకాశం ఉండటంతో రేట్లు కూడా అధికంగా ఉన్నాయి. త్వరగానే సీజన్ ముగిసే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.


హైవే పక్కన అమ్మకాలు

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.90
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.30

